క్లుప్తంగా

క్షీరాభిషేకం



సంగెం : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా పాలనకు అంకురార్పణ చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. బుధవారం మండల కేంద్రంలో ఇందిరాగాంధీ విగ్రహం ఎదుట సీఎం చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మెట్టుపల్లి రమేష్, యూత్ అధ్యక్షుడు ఆగపాటి రాజు, మాజీ సర్పంచ్ జనగాం రమేష్, నాయకులు గుండేటి రాజు, మెట్టుపల్లి ఏలియా, పులి సాంబయ్య, గుండేటి రాజేష్, పోలేబోయిన శ్రీనివాస్, సామ్మలు నాయక్, భద్రయ్య, రామకృష్ణ, వంశీ, రాజు, శ్రీనివాస్, కుమారస్వామి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం



గీసుకొండ : మండలంలోని చంద్రయ్యపల్లిలో గ్రేటర్ వరంగల్ నగరంలోని శరత్ మ్యాక్స్‌విజన్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి పరీక్షల వైద్యశిబిరాన్ని నిర్వహించారు. కంటి పరీక్షలు నిర్వహించి గ్రామస్తులకు మందులను పంపిణీ చేశారు. సర్పంచ్ ఆకుల స్రవంతిరుద్రప్రసాద్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సన్మానం



నర్సంపేట : నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ మల్లం నవీన్‌ను ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాల నాయకులు డాక్టర్ గద్ద వెంకటేశ్వర్లు, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు కల్లపల్లి ప్రణయ్‌దీప్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో గుంటి వీరప్రకాశ్, ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్, శ్రీకాంత్, మనోహర్, ప్రదీప్, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే ప్రశాంతత



వర్ధన్నపేట : ఆధ్యాత్మికతతోనే ప్రశాంతత లభిస్తుందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ అన్నారు. గురువారం మండలంలోని చెన్నారం గ్రామంలో అయ్యప్పసేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్పస్వామి పడిపూజ కార్యక్రమానికి అరూరి రమేశ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీపీ అన్నమనేని అప్పారావు, వర్ధన్నపేట పీఎసీఎస్ చైర్మన్ కొడగాని రాజేష్‌ఖన్నా, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కమ్మగోని స్వామిరాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు తూల్ల కుమారస్వామి, సర్పంచ్ పానుగోటి భాస్కర్‌రావు, మాజీ సర్పంచ్ సిందం లక్ష్మీనారాయణ, ఉప సర్పంచ్ రాజమౌళి, నాయకులు రంగారావు, రాములు, నిరంజన్, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

'హరిత' కొమ్మల నరికివేత



ఖానాపురం : మండలంలోని ధర్మరావుపేటలో హరితహారం చెట్ల కొమ్మలు నరికివేసిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన అవసరాల కోసం పచ్చని చెట్ల కొమ్మలను నరికివేశాడు. హరితహారం చెట్ల కొమ్మలను ఇష్టారాజ్యంగా నరికివేయడం సరికాదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇదే విషయంపై ఎంపీడీఓ సుమణవాణిని వివరణ కోరగా విషయం తన దృష్టికి రాలేదని, సంబంధిత వ్యక్తికి నోటీసులు జారీ చేస్తామన్నారు.

దుస్తుల పంపిణీ

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ గొర్రెకుంటలో బుధవారం హెల్త్ హోం సొసైటీ అధ్యక్షుడు పోలెపాక సుమన్, కాంగ్రెస్ నాయకుడు పసునూటి కృష్ణారెడ్డి పారిశుద్ధ్య, నీటి సరఫరా కార్మికులకు బుధవారం దుస్తులు పంపిణీ చేశారు. పరకాల ఎమ్మెల్యేగా రేవూరి ప్రకాశ్‌రెడ్డి గెలుపుతో పాటు, కొండా సురేఖకు మంత్రి పదవి రావడంతో దుస్తులను పంపిణీ చేశామన్నారు. జన్ను పీటర్, ల్యాదెల్ల సాల్మన్, ల్యాదల్ల రవీందర్, రాము, సాంబయ్య, రాజేందర్, రాజయ్య, సుదర్శన్ పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు

వర్ధన్నపేట : ప్రజా పాలనలతో ప్రజల సమస్యలను పరిష్కరించడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు అన్నారు. బుధవారం వర్ధన్నపేట రైతువేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మండలంలో పలు గ్రామాలకు, వర్ధన్నపేట పట్టణానికి చెందిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఆశ వర్కర్లతో నేటినుంచి నిర్వహించే ప్రజాపాలన గ్రామసభల దరఖాస్తుల స్వీకరణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వాన్ని బదనాం చేయడానికి కొందరు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. కానీ వారి ఆలోచనలను కాదని ప్రభుత్వం ఆరు గ్యారంటీలను ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని అమలు చేయడానికి సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి, వరంగల్ ఆర్డీఓ వాసుచంద్ర, ఎంపీపీ అన్నమనేని అప్పారావు, జెడ్పీటీసీ మార్గం భిక్షపతి, మండల ప్రత్యేకాధికారి సురేష్‌కుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ ఆంగోత్ అరుణ, కమిషనర్ జోనా, వార్డు సభ్యులు సమ్మెట సుధీర్, కొండేటి అనిత, బానోత్ అనిత, నాయకులు మార్నేని వెంకటేశ్వర్‌రావు, నరుకుడు వెంకటయ్య, గుజ్జ రవీందర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అందరి ప్రభుత్వం

పర్వతగిరి : కాంగ్రెస్ ప్రభుత్వం అందరి ప్రభుత్వమని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని ఎంపీడీఓ సభా ప్రాంగణంలో బుధవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ప్రజా పాలనపై ఎంపీపీ లూనావత్ కమల పంతులు అధ్యక్షతన ఏర్పాటు చేసిన అధికారులు, ప్రజా ప్రతినిధుల సమావేశంలో నాగరాజు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సింగ్‌లాల్, ఆర్డీఓ వాసుచంద్ర, తహసీల్దార్ వెంకటస్వామి, ఎంపీడీఓ చక్రాల సంతోష్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్‌నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు, కిసాన్ సెల్ అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్‌రావు, కాంగ్రెస్ నాయకులు కుందూరు వెంకట్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు దిలీప్, అనిల్, పార్టీ గ్రామ అధ్యక్షుడు కూసం రామచంద్రు, ఎంపీటీసీ బొట్ల మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పాలనే.. ప్రభుత్వ పాలన: దొంతి

నర్సంపేట : ప్రభుత్వ పాలన ప్రజా పాలన అని, అభయహస్తాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. ఈ మేరకు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండల రెవెన్యూ అధికారులు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, ప్రోగ్రాం మండల నోడల్ ఆఫీసర్లతో అభయహస్తం తీరుపై బుధవారం సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అధికారులు ప్రజలందరికి ప్రభుత్వం పథకాలు అందే విధంగా లబ్ధిదారుల ఎంపిక కొనసాగించాలన్నారు. అట్టడుగు వర్గాల ప్రజలకు ఏ ఒక్కరికీ కూడా లబ్ధి జరగకపోయినా ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా అధికారులు వ్యవహరించాలని సూచించారు.



నర్సంపేట: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి



వర్ధన్నపేట: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు



రాయపర్తి: కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

రాయపర్తి : ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలకతీతంగా ప్రజాప్రతినిధులు, నాయకులు సమన్వయంతో పని చేసి ప్రజలకు పథకాలు అందేలా చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, వైస్ ఎంపీపీ ఎనగందుల యాకనారాయణ, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ గుగులోత్ కిషన్, నాయబ్ తహసీల్దార్ సూర్య, ఎంపీఓ రామ్మోహన్, ఆయా గ్రామాల సర్పంచ్, ఎంపీటీసీలు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

'కనుజు' మృతిపై విచారణ

సాక్షి ఎఫెక్ట్..

ఖానాపురం : మండలంలోని చిలుకమ్మనగర్ శివారులో పలువురు వేటగాళ్ల ఉచ్చులకు కనుజు మృతిచెందిన విషయం విదితమే. దీంతో 'సాక్షి' దినపత్రికలో ఈనెల 25న 'వేటగాళ్ల ఉచ్చులకు వన్యప్రాణుల బలి' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో మహబూబాబాద్ ఫారెస్ట్ ఉన్నతాధికారులు స్పందించి విచారణ చేపట్టి బాధ్యులను గుర్తించాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. కొత్తగూడ బీట్ అధికారులు చిలుకమ్మనగర్ గ్రామంలో రెండు రోజులుగా విచారణ చేస్తున్నట్లు సమాచారం. ఇందులో భాగంగానే పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకొని వదిలేసినట్లు తెలుస్తోంది. కనుజును మట్టుబెట్టిన వేటగాళ్లను గుర్తించే పనుల్లో ఫారెస్ట్ అధికారులు నిమగ్నమయ్యారు.

కరపత్రాల ఆవిష్కరణ



నర్సంపేట : బలమైన విప్లవ కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి పీసీసీ సీపీఐ(ఎంఎల్), సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, సీపీఐ(ఎంఎల్) రివల్యూషనరీ ఇనిషియేటివ్ పార్టీలు విలీనమవుతున్న సందర్భంగా 2024 మార్చి 3, 4, 5తేదీల్లో ఖమ్మంలో జరిగే ఐక్యతా జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి చిర్రసూరి పిలుపునిచ్చారు. ఈ మేరకు పట్టణంలో జిల్లా కమిటీ సమావేశం కోడెం సారంగం అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. నాయకులు రాకేష్, బి.నర్సింహారావు, రాజు, బుచ్చన్న, లింగన్న, జవహర్‌లాల్, మనోహరచారి, రాజేందర్, శేఖర్, నారాయణ, బాలు, లక్ష్మి పాల్గొన్నారు.

నేటినుంచి 'ప్రజా పాలన' గ్రామసభ

చెన్నారావుపేట : నేటినుంచి 2024 జనవరి 6వ తేదీ వరకు ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ భారతి తెలిపారు. ఈ మేరకు గ్రామ సభల తేదీలను ఆమె ప్రకటించారు. 28న అమీనాబాద్, కాల్‌నాయక్ తండా, కోనాపురం, ఉప్పరపల్లి, 29న పాపయ్యపేట, జీడిగడ్డ తండా, ఖాదర్‌పేట, గొల్లపల్లి, 30న బోజేర్వు, లింగగిరి, అక్కల్‌చెడ, 2024జనవరి 2న అమృతండా, ధర్మతండా, కందిగడ్డ తండా, 3న బోడమాణిక్యం తండా, తోపనగడ్డ తండా, శంకరం తండా, బాపునగర్, పదహారు చింతల్ తండా, 4న పుల్లయ్యబోడు తండా, లింగాపురం, చెరువుకొమ్ముతండా, 5న జోజిపేట నారాయణతండా, సూర్యపేటతండా, గొల్లభామతండా, పత్తినాయక్‌తండా, 6న చెన్నారావుపేట, తిమ్మరాయినిపహాడ్, ఎల్లాయగూడెంలో గ్రామ సభలు ఉంటాయన్నారు.

నేటినుంచి దరఖాస్తుల స్వీకరణ

వర్ధన్నపేట : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ నేటినుంచి(గురువారం) 2024జనవరి 6వ తేదీ వరకు స్వీకరించడం జరుగుతుందని సంబంధిత శాఖల అధికారులు తెలిపారు.వర్ధన్నపేట పట్టణంలో నేడు 28న(గురువారం) 1వ వార్డు భారతీయ నాటక కళాసమితి ఆవరణలో, 2వ వార్డు రాజస్థాన్ వీధిలో, 29న 3వార్డు బ్రహ్మం స్కూల్ ఆవరణలో, 4వ వార్డు భవానికుంట తండా స్కూల్‌లో, 30న గుబ్బెడితండా యూపీఎస్ ఆవరణలో, గుబ్బెడి తండాతో పాటు 6 వార్డు మిని ఫంక్షన్ హాలులో, 2024 జనవరి 2వ తేదీన 7 వార్డు కమ్యూనిటీ హాలులో, 8వ వార్డు ఉన్నత పాఠశాల ఆవరణలో, 3వ తేదీన 9వ వార్డు యాదవకాలనీలో, 10వ వార్డు ఎంఎంఆర్ ఫంక్షన్ హాలులో, 4వ తేదీన 11 వార్డు శివాలయం ఆవరణలో, 12వ వార్డు ముదిరాజ్ కమ్యూనిటీ హాలులో మొత్తం 3,619 కుటుంబాల నుంచి దరఖాస్తుల స్వీకరిస్తారని అధికారులు తెలిపారు.

వర్ధన్నపేట మండలంలో..

28 నేడు (గురువారం) రామవరం, దివిటిపల్లిలో, 29న చంద్రుతండా, రాంధన్‌తండా, అంబేడ్కర్‌నగర్, 30న కాశగూడెం, చెన్నారంలో, జనవరి 2న రామోజీ కుమ్మరిగూడెం తండా, కడారిగూడెం, కట్ర్యాలలో, 3న బొక్కలగూడెం, 4న ల్యాబర్తి, ఇల్లంద, కొత్తపల్లిలో, 5న నల్లబెల్లి, దమ్మన్నపేటలో, 6న ఉప్పరపల్లి గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల్లో కౌంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు.

ప్రజాపాలనను సద్వినియోగం చేసుకోవాలి

రాయపర్తి : మండలంలోని గ్రామాల్లో నిర్వహించే ప్రజాపాలన సభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ గుగులోత్ కిషన్ కోరారు. బుధవారం సంబంధిత గ్రామాల షెడ్యూల్‌ను విలేకరులకు తెలిపారు. నేడు(గురువారం) జయరాంతండా(ఎస్), బాల్‌నాయక్‌తండా, జగన్నాథపల్లి, దుబ్బతండా, పన్యానాయక్‌తండా, కిష్టాపురం, ఆరెగూడెం, జింకురాంతండా, 29న జేతురాంతండా, బురహాన్‌పల్లి, రాగన్నగూడెం, గణేష్‌కుంటతండా, పోతిరెడ్డిపల్లి, వాంకుడోత్ తండా, ఎర్రకుంటతండా, కేశవాపురం, 30న కాట్రపల్లి, పెర్కవేడు, మైలారం, కొండూరు, 2024జనవరి 2న వెంకటేశ్వరపల్లి, సన్నూరు, గట్టికల్, పానీష్‌తండా, బంధనపల్లి, కొత్తూరు, కొలన్‌పల్లి, జయరాంతండా(కె), 3న రాయపర్తి, ఏకేతండా, సూర్యతండా, ఊకల్, బాలాజీతండా, గన్నారం, తిర్మలాయపల్లి, 4న మొరిపిరాల, ఆర్అండ్ఆర్‌కాలనీ గ్రామం, మహబూబ్‌నగర్, కొండాపురం గ్రామాల్లో ప్రజాపాలన సభలను నిర్వహించనున్నట్లు తెలిపారు. సూపర్‌వైజింగ్ ఆఫీసర్లుగా తహసీల్దార్ శ్రీనివాస్-99487 84634, ఎంపీడీఓ గుగులోత్ కిషన్-92814 89367, ఎంపీఓ-97043 24220, ఏఓ వీరభద్రం -72888 94735లను సంప్రదించవచ్చన్నారు.

'మున్సిపాలిటీ నుంచి డీసీతండాను తొలగించండి'

వర్ధన్నపేట : వర్ధన్నపేట పరిధిలోని డీసీ తండాను మున్సిపాలిటీ నుంచి తొలగించాలని స్థానిక గిరిజనులు కోరారు. ఈ మేరకు తమ తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని డీసీ తండాతో పాటు పలు తండాలకు చెందిన గిరిజన మహిళలు ఎమ్మెల్యే నాగరాజుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా గిరిజన మహిళలు మాట్లాడుతూ తమ తండా మున్సిపాలిటీగా ఏర్పడిన తర్వాత ఎలాంటి అభివృద్ధి జరగలేదని పైగా పన్నులు మాత్రం తాము చెల్లించలేని విధంగా ఉన్నాయని వాపోయారు. తమ తండాలను వర్ధన్నపేట మున్సిపాలిటీ నుంచి తొలగించి గ్రామ పంచాయతీగా చేయాలని కోరారు.

డ్రాపౌట్ పిల్లల సర్వే

సంగెం : మండలంలోని పలు గ్రామాల్లో బడీడు పిల్లలు బడికి పోకుండా ఇంటి వద్ద ఉంటున్న వారి ఇంటింటి వెళ్లి సర్వే నిర్వహిస్తున్నారు. బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి తిరిగి పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. బుధవారం మండలంలోని నార్లవాయి, బాలునాయక్ తండాలో సీఆర్పీ కె. రాజు ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు కె. విజయ, సీఆర్పీలు శంకర్, శ్రీధర్, సారయ్య, సరిత, ఐఆర్పీలు మంజుల పాల్గొన్నారు.

గణితంపై అవగాహన ఉండాలి



చెన్నారావుపేట: మాట్లాడుతున్న ఉమారాణి



రాయపర్తి: ప్రశంస పత్రాలతో విద్యార్థులు

చెన్నారావుపేట : గణితంపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఇన్‌చార్జ్ హెచ్ఎం ఉమారాణి అన్నారు.ఈ మేరకు మండల కేంద్రంలోని హైస్కూల్‌లో బుధవారం గణిత ప్రతిభా పోటీలను మండల గణిత ఫోరం ఉపాధ్యాయులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు గణిత ప్రతిభా పోటీలను నిర్వహించి గణితంపై పట్టు సాధించాలన్నారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డిసెంబర్ 22న జాతీయ గణిత దినోత్సవాన్ని శ్రీనివాస రామానుజన్ జయంతిన నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలోఉపాధ్యాయులు కరుణాకర్‌రెడ్డి, సుధాకర్, రజిత, శ్రీనివాస్‌రెడ్డి, రమేష్, సీఆర్‌పీలు సంపత్, స్వామి తదితరులు ఉన్నారు.

ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి

రాయపర్తి : పాఠశాల స్థాయిలోనే ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని, కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మండల నోడల్ అధికారి సుజన్ తేజ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శ్రీనివాసరామానుజన్ జయంతిని పురస్కరించుకొని విద్యార్థులకు బుధవారం మండలస్థాయి మ్యాథమెటిక్స్ టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభను కనబర్చిన విద్యార్థులను ఎంపిక చేసి ఈనెల 29న నర్సంపేటలో జరిగే జిల్లాస్థాయి టాలెంట్‌టెస్ట్‌కు పంపిచనున్నట్లు తెలిపారు. హెచ్ఎం గారె కృష్ణమూర్తి, టీఎంఎఫ్ మండలశాఖ అధ్యక్షుడు చెడుపాక కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు సంతోష్, మహేష్, ప్రవీణ్‌రెడ్డి, రామ్మూర్తి, రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

దుగ్గొండి : విద్యార్థులు పట్టుదలతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు రామస్వామి అన్నారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మండల స్థాయి మేథమెటిక్స్ టాలెంట్ టెస్టు బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు అహ్మద్, విద్యార్థులు పాల్గొన్నారు.

పకడ్బందీగా దరఖాస్తులు స్వీకరించాలి



గీసుకొండ: మాట్లాడుతున్న ఎంపీపీ సౌజన్య



చెన్నారావుపేట: మాట్లాడుతున్న బాలకృష్ణ



ఖానాపురం: మాట్లాడుతున్న ఎంపీపీ ప్రకాశ్ రావు



దుగ్గొండి: మాట్లాడుతున్న శ్రీనివాస రావు



సంగెం: మాట్లాడుతున్న ఎంపీడీఓ రవీందర్

ఖానాపురం : మండల వ్యాప్తంగా నేటి(గురువారం) నుంచి ప్రారంభం కానున్న గ్రామ సభల్లో ప్రజాపాలన దరఖాస్తులను పకడ్బందీగా స్వీకరించాలని ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, ఎంపీడీఓ సుమణవాణి తెలిపారు.ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం అవగాహన సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఏఓ శ్రీనివాస్, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేయాలి

దుగ్గొండి : ప్రజా పాలనలో భాగంగా అర్హులైన ప్రతి ఒక్కరూ సంక్షేమ పథకాల కోసం దరఖాస్తు చేయాలని మండల నోడల్ ఆఫీసర్, జిల్లా ఉద్యానవన అధికారి శ్రీనివాస రావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీడీఓ కృష్ణప్రసాద్, ఎంపీఓ శ్రీధర్, ఏఓ దయాకర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

సంగెంలో..

సంగెం : మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రజాపాలన దరఖాస్తు గ్రామ సభలపై ఎంపీడీఓ కాసర్ల రవీందర్ అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ కళావతి, జెడ్పీటీసీ సుదర్శన్‌రెడ్డి, మండల ప్రత్యేకాధికారి రవీందర్, తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీఓ కొమురయ్య, ఏఓ యాకయ్య, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చెన్నారావుపేటలో..

చెన్నారావుపేట : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఈజీఎస్ సిబ్బంది, వ్యవసాయ అధికారులు, ఏఎన్ఎంలు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, పలు శాఖల అధికారులతో ప్రజాపాలనపై మండల స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ బాలకృష్ణ అవగాహన నిర్వహించారు. తహసీల్దార్ ఫణికుమార్, ఎంపీడీఓ భారతి, ఎంపీఓ శ్రీధర్ రాజు, పలు శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

గీసుకొండలో..

గీసుకొండ : మండలంలో నేటినుంచి చేపడుతున్న ప్రజాపాలన గ్రామ సభలను అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు విజయవంతం చేయాలని ఎంపీపీ భీమగాని సౌజన్య అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన సభల నిర్వహణపై అధికారులు, సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎంపీడీఓ వీరేశం, నాయబ్ తహసీల్దార్ భారతి, ఎంపీఓ ప్రభాకర్, ఏఈఓ సంపత్‌రెడ్డి, సుధాకర్, వెంకటేష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మాధవి, స్వప్న, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఆర్థికసాయం

పర్వతగిరి : మండలంలోని ఏనుగల్ గ్రామానికి చెందిన చెట్టబోయిన సాంబయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సందర్భంగా హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ సభ్యుడు గూడ నరేందర్ మిత్రుల సహకారంతో సేకరించిన రూ.50వేల నగదును బుధవారం మృతుడి కుమారుడు మైభూరాజుకు అందజేశారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ ఇంకా ఎవరైనా దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సాయం చేయాలని కోరారు.

ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పరామర్శ

నర్సంపేట : నర్సంపేట 24వ డివిజన్‌కు చెందిన ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ గద్ద అశోక్ ఇటీవల మృతి చెందగా బుధవారం దశదినకర్మ నిర్వహించారు. ఈ మేరకు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి దశదినకర్మలో పాల్గొని జగన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే 18వ డివిజన్‌కు చెందిన అపరాధపు వెంకటమ్మ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శ

గీసుకొండ : మండలంలోని శాయంపేటహవేలికి చెందిన బీఆర్ఎస్ మండల నాయకుడు ముంత రాజయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా బాధితుడిని బుధవారం పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు. అలాగే ఊకల్‌కు చెందిన మొగసాని రమేశ్ ఇటీవల రైలు ప్రమాదంలో మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పూడికతీత పనులు ప్రారంభం



నల్లబెల్లి /ఖానాపురం : నల్లబెల్లి మండలంలోని గోవిందాపూర్ శివారులో నల్లమాటు మత్తడి పంట కాల్వ పూడికతీత పనులను ఇంజనీరింగ్ అధికారులతో కలిసి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిట్యాల తిరుపతి రెడ్డి బుధవారం ప్రారంభించారు. డీఈ రవి, ఏఈఈ పవిత్ర, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌లు వైనాల అశోక్, ఇస్తారు శేఖర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పురుషోత్తం సురేష్, నాయకులు పాల్గొన్నారు.అలాగే ఖానాపురం మండలంలోని మొట్లపాయ, కాకులగుడ్డాల కాల్వల పూడికతీత పనులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శాఖమూరి హరిబాబు బుధవారం ప్రారంభించారు. మైనార్టీ సెల్ అధ్యక్షుడు ముస్తఫా, వీరమనేని సాగర్‌రావు, మోహన్‌రెడ్డి, రాములు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు అభినందనలు



ఖానాపురం /నర్సంపేట : నర్సంపేట ఎమ్మెల్యేగా ఎన్నికైన దొంతి మాధవరెడ్డిని అశోక్‌నగర్ యూత్ కాంగ్రెస్ నాయకులు, మహిళా సమన్వయ సమితి సభ్యులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం శుభాకాంక్షలు తెలిపారు.

ఆరోపణలు సరికాదు

నర్సంపేట రూరల్ : ముదిరాజ్‌ల అభివృద్ధికి కృషి చేస్తున్న మెపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్‌పై ఆరోపణలు చేయడం సరికాదని జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ అన్నారు. నర్సంపేట మండలంలోని కమ్మపల్లిలో ఆయన మాట్లాడుతూ.. నిత్యం ముదిరాజ్‌ల అభివృద్ధి కోసం పనిచేస్తున్న దేవేందర్‌పై ఆరోపణలు సరికాదన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు కొత్తగట్టు శ్రీనివాస్ ఏనాడు ఏ ఒక్క జిల్లాలో పర్యటించలేదన్నారు. దేవేందర్ పదవీ కాలం ముగిసిందని చెబుతున్న కొత్తగట్టు శ్రీనివాస్ తన పదవీ కాలం కూడా పూర్తి అయిందనే విషయాన్ని మర్చిపోవడం ఆశ్చర్యం కలిగిస్తుందన్నారు.

దోషులను శిక్షించాలి



పర్వతగిరి : మండలంలోని కల్లెడ,-బూర్గుమళ్ల గ్రామాల మధ్య గల భైరవ గుట్టపై నిర్మిస్తున్న ఆంజనేయస్వామి గుడిపై మంగళవారం రాత్రి సిలువ గుర్తులు వేసిన దోషులను అరెస్టు చేయాలని హనుమాన్ భక్తులు, అయ్యప్ప భక్తులు, హిందూ బంధువులు, ధార్మిక సంఘాల బాధ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పలు సంఘాల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించి పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా చేసిన వారిని వదిలేది లేదని, దీనిపై విచారణ చేసి వెంటనే దోషులను పట్టుకొని చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బొబ్బాల ప్రతాప్‌రెడ్డి, గుండెల్లి రంజిత్, పోలోజు శ్రీనుచారి, వెంకటస్వామి, రాజేష్, బాసాని సత్యం, రాము, రజనికాంత్ తదితరులు పాల్గొన్నారు.